క్లుప్తంగా

నేటి నుంచి ఆలయ వార్షికోత్సవం


ప్రత్యేక అలంకరణలో మూల విరాట్

సారవకోట: మండలంలోని వడ్డినవలస గ్రామంలో గల త్రినాథ స్వామి ఆలయ 68వ వార్షికోత్సవం బుధవారం నుంచి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమార్చనలు, ఉత్సవ మూర్తుల తిరువీధి, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు అర్చకులు మనోజ్ శర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో, స్వామి వారి మూల విరాట్‌ను వివిధ రకాల పూలతో అలంకరించారు.

వేలంపాట వాయిదా


మాట్లాడుతున్న డీఎల్‌పీఓ రమణ

నరసన్నపేట: మేజరు పంచాయతీ నరసన్నపేటలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి ఆశీల వేలంపాట శనివారానికి వాయిదా పడింది. డివిజన్ పంచాయతీ అధికారి ఐ.వి.రమణ ఆధ్వర్యంలో మంగళవారం ఆశీల వేలం పాట నిర్వహించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు పాటదారులు ఎవరూ ముందుకు రాకపోవడంతో వేలం పాటను వాయిదా వేస్తున్నట్లు డీఎల్‌పీఓ తెలిపారు. శనివారం వేలంపాట యథావిధిగా నిర్వహిస్తామని, పాటదారులు ప్రభుత్వం ప్రకటించిన ధరకు మించి వేలంపాట పాడాలని సూచించారు. వేలంపాటలో ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ విజయకుమార్, పంచాయతీ ఈఓ ద్రాక్షాయిని, తదితరులు పాల్గొన్నారు.

జీడితోటకు 18న..

పోలాకి: మండల పరిషత్ ఆధీనంలో ఉన్న కోడూరు జీడిమామిడి తోట వేలం ప్రక్రియను ఈ నెల 18వ తేదీకి వాయిదా వేసినట్లు ఎంపీడీఓ రవికుమార్ తెలిపారు. మంగళవారం నిర్వహించాల్సిన వేలంపాట సాంకేతిక కారణాలతో నిలిచిపోయిందన్నారు.

సచివాలయం పరిశీలన


మాట్లాడుతున్న ఎంపీడీఓ తిరుపతిరావు


బూర్జ: మండలంలో నిర్వహిస్తున్న పబ్లిక్, ప్రైవేట్ పీపుల్స్ పార్టీ, హౌస్ హోల్డ్, వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వేలు క్షేత్రస్థాయిలో నిర్వహించాలని ఎంపీడీఓ ఆర్.తిరుపతిరావు అన్నారు. మండలంలోని ఏపీపేట సచివాలయాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ సమయపాలన పాటించాలని, బయోమెట్రిక్ విధిగా వేయాలన్నారు. రికార్డులను తనిఖీ చేశారు. ప్రభుత్వ పథకాల అర్హుల జాబితాలు సిద్ధం చేయాలన్నారు. సచివాలయ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన


మాట్లాడుతున్న తహసీల్దార్ కిరణ్ కుమార్

పాతపట్నం: గిరిజనులు ప్రకృతి వ్యవసాయం పండించేలా ప్రోత్సహించాలని, గిరిజన గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తహసీల్దార్ ఎస్.కిరణ్ కుమార్ అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బ్రెడ్స్, ఏపీఎఫ్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయంపై గిరిజనులకు చైతన్యం కల్పించాల్సి బాధ్యత స్వచ్ఛంద సేవా సంస్థలపై ఉందన్నారు. ఎంపీడీఓ టి.చంద్రకుమారి, ఎంఈఓలు గోవిందరావు, తిరుమలరావు, ఏఈఓ భారతి, బ్రెడ్స్ ప్రతినిధులు రామకృష్ణ, రామచంద్ర, ప్రసాద్, యోగేశ్వరరావు, పాతపట్నం, మెళియాపుట్టి, హిరమండలం, సారవకోట మండలాలకు చెందిన గిరిజనులు పాల్గొన్నారు.

పరామర్శ..


పేరెడ్డి సురేష్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న రెడ్డి శాంతి

హిరమండలం: మండలంలోని గులుమూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త పేరెడ్డి సురేష్ తల్లి కృష్ణవేణి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి మంగళవారం గులుమూరు వెళ్లి సురేష్ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. పరామర్శించిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు మీసాల వెంకట రామకృష్ణ, పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.వి.సురేష్ ఉన్నారు.

బాబుగారి భరోసా ఎప్పుడో!


దుక్కి దున్నుతున్న రైతులు

- రాష్ట్ర ప్రభుత్వ సాయం కోసం రైతుల ఎదురుచూపులు
- పెట్టుబడి సాయంగా ఏడాదికి రూ.20 వేల హామీ గాలికి..
- అర్హుల ఖాతాల్లో కేవలం పీఎం కిసాన్ సొమ్ము మాత్రమే జమ..


కొరసవాడ ప్రాంతంలో మొక్కజొన్న సాగు

పాతపట్నం: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏటా క్రమం తప్పకుండా వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా పెట్టుబడి సాయం అందజేశారు. అర్హత ఉన్న ప్రతీ రైతుకు సాయం అందిస్తూ సాగును పండుగగా మార్చారు. ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల్లో అన్నదాత సుఖీభవ ఒకటి. ఖరీఫ్ ముగిసింది. మరో నెల రోజుల్లో రబీ కూడా పూర్తి కానుంది. బాబుగారి భరోసా మాత్రం రైతుల దరిచేరలేదు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని త్వరగా అమలు చేస్తే సాగుకు సాయంగా ఉంటుందని అన్నదాతలు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఒకపక్క అతివృష్టి, మరోపక్క అనావృష్టి, చీడపీడలు, నకిలీ విత్తనాలు రైతులను నట్టేటముంచుతున్నాయి. నియోజకవర్గంలో నదీ తీరప్రాంతాల్లో రబీ సీజన్‌లో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పీఎం కిసాన్ సమ్మాన్‌నిధి నగదు రైతుల ఖాతాల్లో జమైంది. కొత్తగా పగ్గాలు చేపట్టిన టీడీపీ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా రైతులకు ఆర్థిక సాయంపై ఇంకా అధికారిక ప్రకటన విడుదల చేయలేదు.

ప్రభుత్వానికి రైతుల విన్నపం..

గత ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ సమ్మాన్‌నిధి కలిపి రైతులకు ఏటా రూ.13,500 మూడు దఫాలుగా అందించేది. దీనివలన ఖరీఫ్‌లో పంట పెట్టుబడికి వెసులుబాటుగా ఉండేది. తొలి విడతగా రూ.7,500 రైతు ఖాతాల్లో జమచేసేది. చిన్న, సన్నకారు, పేద రైతులకు ఖరీఫ్‌లో పెట్టుబడి చాలావరకు కలిసి వచ్చేది. మే, అక్టోబర్, జనవరి నెలల్లో ఈ రెండు పథకాల నిధులు వారి ఖాతాల్లో జమయ్యేవి. వైఎస్సార్ రైతు భరోసా తొలి విడతగా రూ.5,500లు, రెండో విడత అక్టోబర్‌లో రూ.2 వేల చొప్పున అందించేవారు. కేంద్రం పీఎం కిసాన్ నిధిగా రూ.6 వేలు మూడు విడతలుగా రూ.2 వేల చొప్పున ఇచ్చేవారు. ఈ ఏడాది మేలో సార్వత్రిక ఎన్నికల కారణంగా పీఎం కిసాన్ నిధి జూన్‌లో వేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా రైతులకు అన్నదాత సుఖీభవ పథకం రూ.20 వేలకు సంబంధించి ఇప్పటివరకు జీఓ విడుదల కాలేదు. రాష్ట్ర ప్రభుత్వం కూడా తమ ఖాతాల్లో పెట్టుబడి సాయం అందించాలని రైతులు కోరుతున్నారు. కొత్త ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను త్వరగా అమలు చేస్తే సకాలంలో పంటలను సాగు చేసుకుంటామని రైతులు అంటున్నారు.

అప్పులు చేశాం..



చంద్రబాబు అధికారంలోకి వస్తే రైతులకు పెట్టుబడి కోసం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20 వేలు అందిస్తామన్నారు. పంట సాగు కాలంలో పెట్టుబడి సాయం డబ్బులు రాలేదు. పంట పండించేందుకు ఎరువులు, పురుగు మందులతోపాటు ఇతర అవసరాల కోసం వడ్డీలకు అప్పులు చేశాం. పంట చేతికి వచ్చింది. ఇప్పుడు వడ్డీలతోపాటు అప్పులు తీర్చుతున్నాం.

– పడాల రంజిత్, రైతు, గంగువాడ, పాతపట్నం

పాతపట్నం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అందజేసిన రైతు భరోసా లబ్ధి (రూ.కోట్లలో) వివరాలు...					
మండలం	పాతపట్నం	కొత్తూరు	మెళియాపుట్టి	హిరమండలం	ఎల్.ఎన్.పేట
రైతులు	9,183	10,961	9,597	5,648	5,890
జమ చేసిన మొత్తం	రూ.22.50 కోట్లు	రూ.24.50 కోట్లు	రూ.23.50 కోట్లు	రూ.13.00 కోట్లు	రూ.13.50 కోట్లు

తరలిరండి..



- వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి
- ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్

ఆమదాలవలస: వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఆమదాలవలస పట్టణంలోని పార్టీ కార్యాలయం ఆవరణలో ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళ కలెక్టర్ కార్యాలయం ఎదురుగా పార్టీ అధినేత ఆదేశాల మేరకు ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్న యువత పోరు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఉదయం 9 గంటలకు ఆమదాలవలసలోని పార్టీ కార్యాలయానికి నియోజకవర్గ ముఖ్య నాయకులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ మండల అధ్యక్షులు, జిల్లా, నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మున్సిపల్ వార్డ్ ఇన్‌చార్జిలు, కార్యకర్తలు, జగనన్న అభిమానులు చేరుకోవాలన్నారు. ఇక్కడ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. తదుపరి శ్రీకాకుళం కలెక్టరేట్ వద్దకు చేరుకొని యువత పోరులో పాల్గొందామన్నారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

ఎల్.ఎన్.పేట మండల కేంద్రంలో

ఎల్.ఎన్.పేట: మండల కేంద్రంలో బుధవారం నిర్వహించనున్న వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవానికి పార్టీ శ్రేణులు తరలిరావాలని మండల ప్రెసిడెంట్ పెనుమజ్జి విష్ణుమూర్తి మంగళవారం పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలను వేసిన అనంతరం కేక్ కట్ చేయటం జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి హాజరవుతారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

ఉద్యోగోన్నతులు చేపట్టాలి


మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణమూర్తి

ఆమదాలవలస రూరల్: విద్యాశాఖలో నెలవారీ ఉద్యోగోన్నతులు చేపట్టాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.రమణమూర్తి కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎమ్మార్సీలో ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో 2023 ఏప్రిల్ నాటికి 22,723 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అప్పటి ప్రభుత్వం వెల్లడించిందన్నారు. వాటిలోనే 16,347 పోస్టులను డీఎస్సీకి కేటాయించిందన్నారు. ప్రస్తుతం 27409 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. రెండేళ్లుగా పోస్టులు ఖాళీలుగా ఉన్నా.. కనీసం ఉద్యోగోన్నతులు చేపట్టలేదని, మొక్కుబడి డీఎస్సీ ప్రకటనతో కూటమి నేతలు కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రమణ మాట్లాడుతూ ఉన్న ఖాళీల మేరకు నెలవారీ ఉద్యోగోన్నతులు చేపట్టి సకాలంలో సబ్జెక్టు ఉపాధ్యాయులను నింపే విధానం గతంలో ఉండేదని, ఈ విధానంతో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత తీరేదన్నారు. ఈ విధానాన్ని గత కొన్ని నెలలుగా ఉన్నతాధికారులు అటకెక్కించారన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు పి.రామకృష్ణ, హెచ్.సత్యం, ఎస్.శ్రీనివాసరావు, ఎం.రమేష్ కుమార్, ఆమదాలవలస నియోజకవర్గంలోని నాలుగు మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

మౌలిక సౌకర్యాలు కల్పించాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న పాఠకులు

హిరమండలం: స్థానిక శాఖ గ్రంథాలయంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్‌రాజాకు పాఠకులు వినతిపత్రం అందించారు. మంగళవారం స్థానిక శాఖా గ్రంథాలయాన్ని కుమార్‌రాజా తనిఖీ చేశారు. రికార్డులు, అందుబాటులో ఉన్న పుస్తకాలను పరిశీలించారు. గ్రంథాలయ పని వేళల్లో మార్పులు చేయాలని పాఠకులు కోరారు. తాగునీరు, ప్రహరీ, మరుగుదొడ్లు, తదితర సౌకర్యాలు సమకూర్చాలని విన్నవించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి మాట్లాడుతూ జిల్లాలో 44 పౌర గ్రంథాలయాల్లో 104 మంది ఉద్యోగులు ఉండాలని, 25 మంది రెగ్యులర్, 10 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు మాత్రమే ఉన్నారన్నారు. ఒక్కొక్కరికి రెండేసి గ్రంథాలయాల నిర్వహణ బాధ్యతలు అప్పగించామన్నారు. 2024–25లో జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీలు, పురపాలక సంఘాల ద్వారా గ్రంథాలయ సెస్ బకాయిలు రూ.3.50 కోట్లకు రూ.2 కోట్లు మాత్రమే వసూలు అయ్యాయన్నారు. శాఖా గ్రంథాలయంలో ఉన్న సమస్యలను ఉన్నధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. డిప్యూటీ లైబ్రేరియన్ వి.వి.జి.ఎస్.శంకరరావు, స్థానిక గ్రంథాలయాధికారి కె.ఎర్రమ్మ, సహాయకురాలు అన్నపూర్ణ ఉన్నారు.

గ్లకోమాపై అప్రమత్తం


అవగాహన కల్పిస్తున్న జానకిరామయ్య

కొత్తూరు: గ్లకోమా వ్యాధి అత్యంత ప్రమాదకరమని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఆప్తాలమిక్ ఆఫీసర్ ఇప్పిలి జానికి రామయ్య అన్నారు. గ్లకోమా వ్యాధిపై మండలంలోని మదనాపురం గ్రామ సచివాలయం వద్ద మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. గ్లకోమా వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే కంటి వైద్యులను సంప్రదించాలన్నారు. ముందుగా కంటి చూపు మందగించడం, కంటి లోపల ఎరుపు రంగు రావడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. ఈ లక్షణాలున్న వ్యక్తులు నిత్యం కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. బీపీ, సుగర్ వంటి వ్యాధులున్నవారు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ వ్యాధి ఉన్న వ్యక్తులు అశ్రద్ధ వహిస్తే కంటి చూపు శాశ్వతంగా పోతుందన్నారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

హిరమండలం: విద్యాశాఖ ఆర్జేడీ ఆదేశాల మేరకు ఈ నెల 12వ తేదీ నుంచి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ కె.రాంబాబు తెలిపారు. మంగళవారం మండలంలోని తంప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ముందుగా ఈ నెల 15 నుంచి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారన్నారు. అదే రోజు నుంచి ఒంటి పూట బడులు కావడం వలన స్వల్ప మార్పులు చేసి సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

కొత్తూరు: పశువులను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు స్థానిక ఎస్‌ఐ ఎండీ అమీర్ అలీ తెలిపారు. మండలంలోని నివగాం వద్ద మంగళవారం వాహన తనిఖీలు నిర్వహించామన్నారు. ఎల్.ఎన్.పేటకు చెందిన ఇప్పిలి రజినీకాంత్, నూకరాజు కలిసి వ్యాన్‌పై తొమ్మిది పశువులను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకుని సీజ్ చేశామ న్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఐదు లీటర్ల సారాతో వ్యక్తి అరెస్ట్

- రెండు కేసుల్లో రిమాండ్


నిందితుడుని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ సీఐ కృష్ణారావు

పాతపట్నం: మండలంలోని సవర సిద్ధమనుగు పంచాయతీ (ఒడిశా సరిహద్దు) బొన్ని గిరిజన గ్రామ సమీపంలో ఐదు లీటర్ల నాటు సారాతో అదే గ్రామానికి చెందిన సవర చిన్నప్పన్నను అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ కె.కృష్ణారావు మంగళవారం తెలిపారు. సవర చిన్నప్పన్న ఫిబ్రవరి 27వ తేదీన కొండపై నాటు సారా తయారీకి ఉపయోగపడే 200 లీటర్ల బెల్లం ఊటను నిల్వ ఉంచినట్లు నిర్ధారణ అయిన కేసులో కూడా నిందితుడని అన్నారు. రెండు కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. గ్రామాల్లో బెల్ట్ దుకాణాలను నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యం ధరల పట్టికను దుకాణాల వద్ద తప్పనిసరిగా ఉంచాలన్నారు. మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

14 నుంచి ఆలయ వార్షికోత్సవం

కొత్తూరు: ఈ నెల 14 నుంచి 18వ తేదీ వరకు మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయ 27వ వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నారు. మంగళవారం వాల్ పోస్టర్‌ను ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు ఎల్.లాతబాబు మాట్లాడుతూ.. ఐదు రోజులపాటు కుంకుమార్చనలు, సహస్ర తులసీదళార్చన, విశేష హోమాలు, చక్రతీర్థ స్నానాలు, అన్నప్రసాద కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఎల్.తులసీవరప్రసాదరావు, వై.గోపాలదాసునాయుడు పాల్గొన్నారు. పొగిరి రవి, పొగిరి అర్జున్, భానోజీరావు, పి.నారాయణరావు పాల్గొన్నారు.

నేడు ప్రజావేదిక

జలుమూరు: ఉపాధి పనులపై బుధవారం ఉదయం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ కె.అప్పలనాయుడు మంగళవారం తెలిపారు. ఈ సమావేశానికి సోషల్ ఆడిట్ బృందం, సంబంధిత అధికారులు హాజరవుతారన్నారు.

యువత పోరును విజయవంతం చేయండి


ఎల్.ఎన్.పేట: యువత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రెడ్డి శాంతి, నాయకులు


హిరమండలం: యువత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు


బూర్జ: మదనాపురంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పార్టీ శ్రేణులు

- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎల్.ఎన్.పేట: విద్యార్థులను మోసం చేసిన కూటమి ప్రభుత్వానికి కళ్లు తెరిపించేందుకు వైఎస్సార్‌సీపీ చేపట్టిన యువత పోరులో (ఈ నెల 12వ తేదీన) అందరూ భాగస్వామ్యం కావాలని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని రావిచంద్రిలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె యువత పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా దీవెన, వసతి దీవెన చెల్లించకపోవటంతో విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి ఫీజులు చెల్లిస్తున్నారన్నారు. ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కిలారి త్రినాథులు, పార్టీ మండల ప్రెసిడెంట్ పెనుమజ్జి విష్ణుమూర్తి, ఎంపీటీసీ కొల్ల స్వర్ణలత, సర్పంచ్‌లు కొల్ల ఈశ్వరమ్మ, ముగడ దివాకర్, రెడ్డి రామారావు, పార్టీ నాయకులు శిమ్మ సాంబశివరావు, కొల్ల కృష్ణ, ముగడ జానార్దన, ఈగల చిన్నారావు, కొల్ల రాము, బలగ గోవిందరావు, కొల్ల లక్ష్మునాయుడు, ముద్దాడ లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

హిరమండలంలో..

హిరమండలం: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బుధవారం శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో చేపడుతున్న యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు మీసాల వెంకట రామకృష్ణ, పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.వి.సురేష్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి యువత పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. విద్యార్థులు, నిరుద్యోగులు, పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పార్టీ నాయకులు వంగపల్లి చిన్నారావు, గంగాధరరావు, చెక్కా బాలకృష్ణ, వి.రాజారావు, కె.నర్సింహమూర్తి, పి.కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

మదనాపురంలో..

బూర్జ: ఈ నెల 12వ తేదీన నిర్వహించనున్న యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు బెజ్జిపురపు రామారావు, మండల నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం మదనాపురంలో పార్టీ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు ఆధ్వర్యంలో పార్టీ మండల నాయకులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. మండల ప్రత్యేక ఆహ్వానితులు కర్నేన నాగేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ గుమ్మడి రాంబాబు, నాయకులు తొత్తడి సురేష్, ఏగు రాజారావు, బొడ్డేపల్లి నాగరాజు, కొంచాడ రాము, జి.సుధాకర్, డి.వి.ఎ.నాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెళియాపుట్టిలో..

మెళియాపుట్టి: కూటమి ప్రభుత్వం విద్యార్థులను మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పోలాకి జయమునిరావు, మండల నాయకుడు బైపోతు ఉదయ్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద యువత పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తూరులో..

కొత్తూరు: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను కూటమి ప్రభుత్వం మోసం చేసిందని కొత్తూరు పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గండివలస ఆనందరావు అన్నారు. మంగళవారం కొత్తూరులో యువత పోరు పోస్టర్‌ను పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్సీ సెల్ రాష్ట్ర మాజీ కార్యదర్శి దూలి అప్పన్న, పార్టీ మండల ఉపాధ్యక్షుడు యర్లంకి ధర్మారావు, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి గందవరపు నాగేంద్ర, ఎస్టీ సెల్ పాతపట్నం నియోజకవర్గం కార్యదర్శి సింహాద్రి, బీసీ సెల్ నియోజకవర్గం కార్యదర్శి అగతమూడి నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు వనుము లక్ష్మీనారాయణ, అతగమూడి రంజిత్, పసుపురెడ్డి అశోక్, సవర రమేష్ పాల్గొన్నారు.

పోలాకిలో..

పోలాకి: జిల్లా కేంద్రంలో బుధవారం చేపట్టనున్న యువత పోరుకు తరలిరావాలని డీసీసీబీ మాజీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు కోరారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కణితి కృష్ణారావు అధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు, పార్టీ మండల యువజన, ఎస్సీ విభాగాల అధ్యక్షులు రెంటికోట త్రినాథరావు, కన్నేపల్లి లక్ష్మణరావు, నాయకులు చింతు రామకృష్ణ, తూలుగు అశోక్, నేతేటి వల్లన్నాయుడు, బచ్చు ఆదినారాయణరెడ్డి, బంకా చక్రధర్, తదితరులు పాల్గొన్నారు.


మెళియాపుట్టి: యువత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు


కొత్తూరు: యువత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సూర్యనారాయణ, ఆనందరావు, తదితరులు


పోలాకి: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కరిమి రాజేశ్వరరావు, నాయకులు

మహిళా ఉద్యోగులకు సన్మానం


మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

పాతపట్నం: సమాజంలో స్త్రీ పాత్ర గొప్పదని ఎంఈఓలు ఎ.గోవిందరావు, సి.హెచ్.తిరుమలరావు అన్నారు. స్థానిక ఎమ్మార్సీలో మహిళా దినోత్సవ వేడుకలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో అన్ని రంగాల్లోనూ పురుషులతో సమానంగా మహిళలు రాణిస్తున్నారన్నారు. మహిళలు తలచుకుంటే సాధించలేనిది లేదన్నారు. సమాజంలో తల్లిగా, చెల్లిగా, గృహిణిగా, భార్యగా పలు పాత్రలు పోషించి వారికి వారే సాటిగా నిలుస్తున్నారన్నారు. ఎమ్మార్సీలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులను ఎంఈఓలు సన్మానించారు. ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.